

బహుళ పంటల సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - చాగల్లు

బహుళ పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం కలవలపల్లి గ్రామంలో ముళ్లపూడి మురళీకృష్ణ పొలంలో శుక్రవారం నిర్వహించారు. సిపిసి ఆర్ఐ విశ్రాంత డైరెక్టర్ పి చౌడప్ప, హార్టికల్చర్ జెడి దేవమణి రెడ్డి, డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎన్.మల్లికార్జునరావు, కొవ్వూరు ఉద్యాన విభాగ శాస్త్రవేత్త వి.శివకుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ డి.సుధీర్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మురళీకృష్ణ పొలంలో వేసే కోకో, మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రైతులకు వీటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాండలైజ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జె.విజయ్, రవీంద్ర, చాగల్లు మండల గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు

సగం ఆయకట్టుకే సాగునీరు

- అవసానదశలో ఎత్తిపోతల పథకాలు
- సిఎం హామీ ఇచ్చి రెండు నెలలైనా విడుదలకు నోచని నిధులు
- ప్రతిపాదనలకే పరిమితమైన పునరుద్ధరణ

ప్రజాశక్తి -కొవ్వూరు

గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలు రైతుల సాగు నీటి కష్టాలను తీర్చడంలో నీరిగాయాయి. ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ పథకాల పునరుద్ధరణ పట్ల ప్రభుత్వాలు చొరవ చూపకపోవడంతో పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. మొత్తం ఆయకట్టులో సగం ఆయకట్టుకు సాగు నీరందడం గగనంగా మారింది.

గోదావరి నది తీరంలో తాళ్లపూడి, కొవ్వూరు మండలాలతో పాటు చాగల్లులోనూ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు ఎత్తిపోతల పథకాల ద్వారా 5,991 మంది రైతులకు చెందిన 18,740 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. వీటిలో కేవలం 10,650 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఏళ్ల తరబడి పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులు, పంపు సెట్లు మరమ్మతులకు గురవుతున్నాయి. కొన్ని పథకాలకు కాలువలు పూర్తిగా పాడవ్వడంతో శివారు ప్రాంత రైతులకు నీరందని పరిస్థితి ఏర్పడింది. వీటికి సంబంధించి అధికారులు ప్రతిపాదనలు పంపించడమే తప్ప మంజూరుకు నోచుకోవడం లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుమారదేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, చాగల్లు, బ్రాహ్మణగూడెం ఎత్తిపోతల పథకాలతో పాటు దారవరం ప్రాంతంలో ముంపు నివారణ ఎపిఎస్ఐడిసి అధికారులు రూ.31.01 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు.

కార్యరూపం దాల్చని సిఎం హామీ

గోదావరి ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ ఏడాది జులై 2న తాళ్లపూడి మండలం మలకపల్లి విచ్చేసిన ఆయన బహిరంగ సభలో ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నిధులు సమకూర్చుతానని వెల్లడించారు. హామీ ఇచ్చి ఇప్పటికే రెండు నెలలు పూర్తయింది. నిధులు మాత్రం నేటికీ మంజూరు కాలేదు.

ప్రతిపాదనలకే పరిమితమా?

గతేడాది వైసిపి ప్రభుత్వ హయాంలో పైడిమెట్ట, బ్రాహ్మణగూడెం, చాగల్లు కుమారదేవం ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.6.87 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కుమారదేవం ఎత్తిపోతల పథకంలో నాలుగు మోటార్లకు ఒకటి మాత్రమే పనిచేస్తుంది. దీంతో అత్యవసర పనుల నిమిత్తం డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి రూ. 24.50 లక్షలతో అప్పట్లో టెండర్లు పిలిచారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. 4,650 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఈ పథకం కేవలం 18 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరందిస్తుంది. పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ప్యానెల్ బోర్డులను, రెండు మోటార్లను మార్పు చేయాల్సి ఉంది. ఇక్కడ నూతనంగా రెండు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని గతేడాది రూ.2.42 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్ట లేదు. దీంతో ఇటీవల ఈ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్ ఫార్మర్ లోడ్ అధికం కావడంతో కాలిపోయింది.

కుమారదేవంలో మోటార్ల మరమ్మతులకు రూ.2కోట్లు, కొవ్వాడ కాలవపై నిర్మించిన చాగల్లు, బ్రాహ్మణగూడెం ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.1.55కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అప్పట్లో రైతు సంఘం వాటా కింద 20 శాతం చెల్లించాలని ప్రభుత్వం షరతు పెట్టింది. ఈ సొమ్ము చెల్లించని కారణంగా అప్పట్లో నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత స్థానిక ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు చొరవ తీసుకుని ఎత్తిపోతల పరకాల పునరుద్ధరణకు తాజాగా మళ్లీ ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. దీనిలో కుమారదేవం ఎత్తిపోతల పథకానికి రూ.89 లక్షలు, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకానికి రూ. 5.80 కోట్లు, పైడిమెట్టా ఎత్తిపోతల పథకానికి రూ. 12.20 కోట్లు, చాగల్లు పథకానికి రూ.1.70 కోట్లు, బ్రాహ్మణగూడెం పథకానికి రూ.1.75 కోట్లు చొప్పున ప్రతిపాదనను పంపారు. దారవరం ప్రాంతంలో వరద ముంపు నివారణ కోసం రూ.66 లక్షల ప్రతిపాదనను పంపించారు. మొత్తంగా ఆరు పథకాలకు సంబంధించి రూ.31.01 కోట్లు ప్రతిపాదనలు పంపగా నేటికీ విడుదల కాలేదు.



కుమారదేవం ఎత్తిపోతల పథకం పంపు హౌస్

గుదిబండగా పథకాల నిర్వహణ

ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతు సంఘాలకు గుదిబండగా మారాయి. రైతులు పరస్పర సహకారంతో ఈ పథకాలు నడుపుకోవాల్సి ఉంది. సాగునీరు వినియోగించుకున్నందుకు రైతులు ఎకరాకు రూ.300 నుంచి రూ.450 వరకు రుసుము చెల్లించాల్సి ఉంది.నీటి తీరువ సొమ్ము సక్రమంగా వసూలు కాకపోవడంతో స్కీముల నిర్వహణ కష్టంగా మారింది. కుమారదేవం ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు రూ.70 లక్షలు, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం ద్వారా రూ. కోటికి పైగా వసూలు కావాల్సి ఉంది. పైడిమెట్టతో పాటు ఇతర పథకాలదీ అదే పరిస్థితి. లక్షలాది రూపాయల నీటి తీరువా బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోవడంతో చిన్న చిన్న మరమ్మతులకు సైతం ప్రభుత్వ నిధులపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి తీరువా సకాలంలో వసూలు కాకపోవడంతో స్కీము నిర్వహణ సిబ్బందికి సైతం జీతాలు చెల్లించలేని దయనీయ పరిస్థితుల్లో ఎత్తిపోతల పథకాలు నడుస్తున్నాయి..

పాలకుల నిర్లక్ష్యం... కోట్లాది ప్రజాధనం వథా

మూడు మండలాల పరిధిలో 5వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ప్రారంభించిన అరికరేవుల ఎత్తిపోతల పథకం అసంపూర్తిగా నిలిచిపోయింది. రూ.12.50 కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేసుకున్న ఈ పథకం పూర్తిగా మూలన పడింది. గత వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అయినా ఇంతవరకూ ఈ పథకం ఊసెత్తడం లేదు. పెనకన మెట్ట సమీపంలో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తే ఈ పథకం పూర్తవుతుంది. కాని ప్రభుత్వం ఆ దిశగా ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. పైప్ లైన్ కోసం తీసుకొచ్చిన భారీ తూరలన్నీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పక్కదారి పట్టాయి. పలువురు అక్రమార్కులు వీటిని సొంత పనుల నిమిత్తం తరలించకపోయారు.

రూ. 31 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం...

కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ. 31.01 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఇటీవల తాళ్లపూడి మండలం మలకపల్లి విచ్చేసిన సిఎం నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. దశాబ్దాల క్రితం నిర్మించిన పథకాలు కావడంతో ప్యానెల్ బోర్డులు, మోటార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటన్నింటినీ పునరుద్ధరిస్తే పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందే అవకాశం ఉంటుంది.

-పి.గురవయ్య, డిఇఇ, ఎపిఎస్ఐడిసి,కొవ్వూరు



సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

కనీస వేతనంపై జిఒ ఇవ్వాలి

బ్రెస్ట్‌ప్రైస్ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బెస్ట్ ప్రైస్ షాప్‌నకు అనుమతిస్తూ రాత్రి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికులకు కనీస వేతనం పెంచుతు జిఒలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ డిమాండ్ చేశారు. స్థానిక శ్యామల సెంటర్ వద్ద సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టి.అరుణ్ మాట్లాడుతూ బహుళజాతి కంపెనీ అయిన బెస్ట్ ప్రైస్ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లోడింగ్, ఆన్ లోడింగ్, బిల్లింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం గత సంవత్సరం ఈ బడా కంపెనీకు షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సవరిస్తూ ప్రతేక జిఒ ఇచ్చిందని విమర్శించారు. ఒక సంవత్సరం కాలం ముగియడంతో బెస్ట్ ప్రైస్ యాజమాన్యం కోరిక మేరకు ప్రభుత్వం మళ్లీ ఈ నెల 3న జిఒ 244ను విడుదల చేసిందని తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగాయని, కనీస వేతనాలు పెంచాలని 12 ఏళ్లుగా పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారన్నారు. కాని ప్రభుత్వాలకు లక్షలాది కార్మికుల గోడు పట్టడం లేదన్నారు. బడా కంపెనీల సేవలో కూటమి ప్రభుత్వం పని చేస్తుంది అని విమర్శించారు. కార్మిక చట్టాలు రద్దు చేసి ప్రవేటు, కార్పొరేటర్ కంపెనీలకు అనుకూలంగా పాలన చేస్తున్నారన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయకున్నా ప్రభుత్వాలు, కార్మిక శాఖ స్పందించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎస్ఎస్.మూర్తి, బి.పూర్ణిమరాజు, గంటి కృష్ణ, బేబిరాణి, మాణిక్యాంభ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎంఎల్ఎ నెహ్రూ

గోకవరం : తంటికొండలోని వేంకటేశ్వరస్వామిని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం అధికారులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ బడిరెడ్డి అచ్చన్నదొర, కమిటీ సభ్యులతో దేవస్థానం అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ తంటికొండ గుడి పూర్తిగా అభివృద్ధి చేస్తానన్నారు. 2027 పుష్కరాలకు జగ్గంపేట నియోజకవర్గం ప్రజలకు కానుక అందిస్తానని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంతో పాటు, ముఖ, ప్రాకార మండపాలు, రాజగోపురం, ధ్వజస్తంభం వంటివి ఏర్పాటు చేస్తానన్నారు. చెరువును కోనేరుగా అభివృద్ధి చేస్తామన్నారు. కోనేరు నుంచి కొండ వరకూ ప్రత్యేక మార్గం ఏర్పాటు చేస్తామన్నారు. అన్నదాన భవనాన్ని మరోచోటుకు మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులకు ఘనంగా సత్కరించారు. అవార్డులతో సన్మానించారు. **రాజమహేంద్రవరం** ఆనం కళా కేంద్రంలో పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మొత్తం 87 మందికి అవార్డులు అందించారు. మంత్రి కందులు దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. సమాజం ఉన్నతంగా ఎదిగేలా ఉపాధ్యాయులు తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సాధనతో ఎలాంటి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో సర్వేపల్లి రాధాకృష్ణ ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయ వృత్తి నోబెల్ వృత్తి అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జెసి వై.మేఘస్వరూప్, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, డిఇఒ వాసుదేవరావు, డిఐ బి.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయునికి అవార్డులు మరింత ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. అర్బన్ డిఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ అర్బన్ మండలం నుంచి 40 మందిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఇఒ-2 రమారజని, సిఆర్ఎంటిలు జయంతిశాస్త్రి, జె.శ్రీనివాసరావు, పి.ప్రసాద్, కుమారి, ఇందిర, నాగలక్ష్మి, కోటేశ్వరి పాల్గొన్నారు

కడియం : మండలం నుండి పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం జిల్లా ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. మురమండ జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం బి.సుధ, వెంకాయమ్మ పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.బ్యూలారత్నం, కడియం-2 పాఠశాలకు చెందిన కె.గంగా భవాని, మురమండ నుంచి పి.రమా నాగేశ్వరి పురస్కారాలు అందుకున్నారు.

సీతానగరం : మిర్తిపాడు జిల్లా పరిషత్ హై స్కూల్-2 ఉపాధ్యాయులు రాపాక సూరిబాబు, బొబ్బిల్లంక మండల ప్రజా పరిషత్ స్కూల్ ఉపాధ్యాయురాలు ఎ.మేరీ కుమారి, రఘుదేవపురం ఎంపిపి స్కూల్ నుంచి జివి.పల్లయ్యగుప్త, ప్రభాకర్ నగర్ జడ్‌పిహెచ్ఎస్ నుంచి యు.రామకృష్ణ, సింగవరం ఎంపిపి పాఠశాల ఉపాధ్యా యులు జివివి.దుర్గాప్రసాద్‌రావు అవార్డులు అందుకున్నారు.

పెరవలి : ఐదుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. లంక మాలపల్లి ఎంపిపి పాఠశాలకు చెందిన కె.దుర్గాదేవి, పిట్టల వేమవరం జడ్‌హెచ్ఎస్‌కు చెందిన కె.ఉమా, పెరవలి హైస్కూల్‌కు చెందిన బాలకృష్ణ,, పెరవలి -1 పాఠశాలకు చెందిన పిఎన్ఎస్.శ్రీనివాస్‌కుమార్, తీపర్రు ఎంపిపి పాఠశాల-2కుచెందిన రవికుమార్ అవార్డులు అందు కున్నారు. ఎంపిడిఒ పద్మజ, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, ఎంఇఒలు బి.స్వరూప్, షేక్ సూర్జహాన్, నాయకులు అభినందనలు తెలిపారు.

దేవరపల్లి : దేవరపల్లి భాష్యం స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ పి.పేరయ్యానాయుడు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవ ప్రదమైనదన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భాష్యం జోనల్ ఇన్‌ఛార్జి వి.ఆంజనేయులు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాష్యం చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, వైస్ ప్రిన్సిపల్స్ వెంకటేశ్వరరావు సుదిషా పాల్గొన్నారు.

గోపాలపురం : మండలంలోని నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారని ఎంఇఒలు జి.శ్రీనివాస రావు, ఎ.మహేశ్వరరావు తెలిపారు. రేగులకుంట హై స్కూల్ హెచ్ఎం కె.నారాయణ రావు, గోపాలపురం హై స్కూల్ ఉపాధ్యాయుడు వి.దుర్గాప్రసాద్, ఎస్ వేలచింతలగూడెం పాఠశాల హెచ్ఎం ఎన్‌సిహెచ్. రత్నకుమారి, చిట్యాల ఎంపిపి స్కూల్ టీచర్ సిహెచ్.సూర్యచంద్రం అవార్డులు అందుకున్నారు.

కొవ్వూరు : సమాజానికి గురువులే దిక్సూచి అని, వారిని గౌరవించుకోవడం సంస్కృతిలో భాగమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళం వీర వెంకట శ్రీనివాసరావు అన్నారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను ఆర్యవైశ్య సంఘం తరపున ఘనంగా సత్కరించారు. సంఘ కార్యదర్శి కాకి అనిల్ సూర్య, గౌరవ సలహాదారుడు మొదలు సత్యనారాయణ, కూనల రామ కిషోర్, కంకటాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు : మండలంలో పందలపాక శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి యువరాజారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా అందుకున్నారు.

గోకవరం: పెంటపల్లి ఎంపీ యుపి స్కూల్ హెచ్ఎం కత్తుల వీర్రాజు, గోకవరం జడ్‌పిహెచ్ఎస్ హిందీ పండిట్ రొబ్బి కృష్ణవేణి, మల్లవరం డివిపిఆర్‌యుపిఎస్ టీచర్ ఏళ్ల అబ్రహాం పాల్, కామరాజుపేట ఎంపిపి స్కూల్ టీచర్ చోళ్ల రాజ్ కుమార్ అవార్డులు అందుకున్నారు.


ఉండ్రాజవరం : మండలంలోని కాల్దరి నెంబర్-3 స్కూల్ టీచర్ పులి కుసుమ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. కలెక్టర్ నుంచి అవార్డు స్వీకరించారు. తాడిపర్రు పాఠశాల హెచ్ఎం జి.శ్రీనివాస్ జిల్లా స్థాయి అవార్డు అందుకున్నారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి



అవార్డు అందుకుటున్న మురముండ హెచ్ఎం బి.సుధ



అవార్డును అందిస్తున్న డిఎస్ఇఒ వాసుదేవరావు



వెంకాయమ్మ పేట ఉపాధ్యాయిని బ్యూలారత్నం



అవార్డులు అందుకుంటున్న గోకవరం మండలానికి చెందిన టీచర్లు అబ్రహాం, కె.వీర్రాజు, ఆర్.కృష్ణవేణి, రాజ్‌కుమార్




అవార్డులు అందుకుంటున్న గోపాలపురం మండల ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, రత్నకుమారి, సూర్యచంద్రం



అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయురాలు కుసుమ

కార్టూ'నిజం'



నన్నయలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఆచార్యులు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థి, యువజన, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజమండ్రిలోని అంబేద్కర్ భవన్ ఆవరణలో విద్యార్థి, యువజన, దళిత సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ డి.అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జవ్వల రాంబాబు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘం నాయకులు కోరుకొండ చిరంజీవి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, మాలమహానాడు రాష్ట్ర నాయకులు జంగం సుబ్బారావు, ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు పులిదిండి వేణుగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు. నన్నయ యూనివర్సిటీలో గతంలో వివిధ కారణాలు చూపిస్తూ మెయిన్ క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్ విభాగంలో ఈ ఏడాది అడ్మిషన్లు నిలుపుదల చేయాలని యాజమాన్యం నిర్ణయించిందన్నారు. అన్ని సంఘాలు ఉమ్మడిగా ఉద్యమించడంతో పొలిటికల్ సైన్స్ గ్రూపును యథావిధిగా కొనసాగిస్తామని యూనివర్సిటీ యాజమాన్యం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే వివిధ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ముఖ్యంగా పూర్తిగా ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్ గ్రూపులో పోస్టులను వెంటనే భర్తీ చేసి తరగతులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. యూనివర్శిటీలో నెలకొన్న సమస్యను సకాలంలో పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఐక్యంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం, సమస్యలపై భవిష్యత్తులో ఉద్యమాల కొనసాగుతాయని సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు తెలియజేశారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు భానుప్రసాద్, రాజమండ్రి కార్యదర్శి దినేష్, కమిటీ సభ్యులు దర్నేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపును తొలగించాలి

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో శ్మశాన వాటిక సమీపంలో ఉన్న మద్యం షాపును వెంటనే తొలగించాలని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య డిమాండ్ చేశారు. బహుజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎవి.రావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మద్యం దుకాణం వల్ల దళితులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్యం సేవించి అనంతరం బాటిళ్లను పగులగొడుతున్నారన్నారు. అంత్య క్రియలకు వచ్చిన వారి కాళ్లకు గాయాలవుతున్నాయని తెలిపారు. నీటి ట్యాంకు చుట్టూ చెత్త పోగవుతోంది. షాపు వద్ద మద్యం సేవించి గొడవలు, కొట్లాటలు జరుగుతున్నాయి. షాపు సమీపంలో ఉన్న పంట కాలువలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిళ్ల పడేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను అధికారులకు తెలియజేసినా పట్టించుకోవట్లేదన్నారు. ఈ వైన్స్ షాపు కారణంగా రాపాక, కంచుమర్తిపేట, రవీంద్ర కాలనీ వాసులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి నరసింహకిశోర్

నేనూ ప్రజాశక్తి పాఠకుడినే...

వార్షికోత్సవ ప్రత్యేయక సంచిక ఆవిష్కరణలో ఎస్‌పి నరసింహకిశోర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

'నేనూ ప్రజాశక్తి పాఠకుడినే, ప్రతి రోజూ ఎడిటోరియల్ చదువుతుంటాను' అని ఎస్‌పి డి.నరసింహకిశోర్ అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను ఎస్‌పి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక సంచిక ఆకర్షణీయంగా ఉందని అభినందించారు. వార్తా రచనలో ప్రజాశక్తి శైలిని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ బి.శ్రీనివాసచారి, ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు జె.రవీంద్రనాథ్, సూర్యచంద్రరావు, దినేష్, కెఎస్.పతి, జిజనాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న సిఐలు నరేష్‌కుమార్, గజేంద్రకుమార్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో వివిధ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వివరాలను రాజోలు సిఐ టివి.నరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సిఐ గజేంద్రకుమార్ వెల్లడించారు. కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దొంగతనాలపై నిఘా పెట్టి వరుస చోరీలకు పాల్పడుతున్న రాజోలు మండలం బి.సావరం గ్రామానికి చెందిన కట్టా అర్జున్, ఏలూరుకు చెందిన సోడెం మంగ ప్రసాద్, రాజమండ్రికి చెందిన షేక్ బాషా, కాకినాడ కు చెందిన షేక్ అజీజ్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి 64 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి, రూ.2.80 లక్షల నగదు మొత్తం రూ.11,58, 500 విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై రాజోలు పోలీస్ స్టేషన్లో 3, తూర్పుగోదావరి జిల్లాలో 1, ఏలూరు జిల్లాలో 4, తెలంగాణ రాష్ట్రంలో 1 కేసుల నమోదు అయ్యి ఉన్నాయి. వీరిలో కట్టా అర్జున్‌పై పదికి పైగా దొంగతనం కేసులు ఉన్నాయి. వీరంతా వివిధ దొంగతనాల కేసుల్లో జైలు కు వెళ్లినపుడు అక్కడ పరిచయం అయ్యి బయటకు వచ్చిన తర్వాత చెడు వ్యసనాలకు బానిసలై మరలా దొంగతనాల బాట పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ చోరీ కేసును చాకచక్యంగా ఛేధించిన రాజోలు సిఐ నరేష్ కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐలు రాజేష్‌కుమార్, పరదేశి, ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్లు శేఖర్ రాజు, కోళ్ల వెంకట రమణ, కానిస్టేబుళ్లు అర్జున్, ఎం.హరిబాబు, గుబ్బల సాయి కృష్ణ, బి.ప్రసాద్, ఎ.సుధాకర్, ఎల్.శ్రీను, ఆర్.ప్రసాద్, ఎం.రమేష్, కిషోర్, రెడ్డి, ఆర్. శ్రీనులను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- తాళ్లరేవు

నీలపల్లిలోని వికాస్ లేఔట్‌లో జూన్ 12న ఒక ఇంటిలో జరిగిన చోరీ కేసులో పలివెల చరణ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు రికవరీ చేశామన్నారు. అతడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

బి.కొత్తూరు ఘటనపై అట్రాసిటీ కేసుల నమోదు

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని బి.కొత్తూరులో వినాయక నిమజ్జనం వేడుకల్లో జరిగిన ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ జాన్ బాషా తెలిపారు. చెల్లి గణేష్, మరో వర్గానికి చెందిన బొంగులూరి పవన్ కుమార్ తమపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులు చేశారన్నారు. బి కొత్తూరు గ్రామాన్ని ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్ సందర్శించారు. ఇరు వర్గాలు చేసుకున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. 9 మందిపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

నేడు కామనగరువులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం కామనగరువు రాజులపూడి వెంకటేశ్వరరావు కాలనీ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అమలాపురం రోహిణి తల్లి, పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నక్క అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ చిన్న పిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ విఎస్‌ఎస్‌ఎన్.మూర్తి (రోహిణి డాక్టర్) చిన్న పిల్లలకు పుట్టిన పిల్లల నుంచి 15 సంవత్సరాల వరకు అన్ని రకముల ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. స్త్రీ, ప్రసూతి, స్కానింగ్, సంతాన సాఫల్య కేంద్ర వైద్య నిపుణులు డాక్టర్ వి.శారద (రోహిణి మేడం) గర్భిణులకు, స్త్రీల యొక్క అన్ని రకముల ఆరోగ్య సమస్యలకు పరీక్షించి ఉచితం గా మందులు అందజేస్తారన్నారున ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించు కోవలసిందిగా సర్పంచ్ కోరారు. వివరాలకు పిఆర్ఒ ఎ.శ్రీనివాసరావు 917770710ను సంప్రదించాలన్నారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

వర్షాలు, వరదల నేపథ్యంలో చెరువులు, నదీ ప్రవాహాలు ఎక్కువగా ఉన్నందున గణపతి విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటిం చాలని కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్ అన్నారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో అంబాజీపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సిఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రదేశాలలో చిన్న పిల్లలు, మహిళలను తీసుకురాకుండా ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు జాగ్రత్తగా పాటించాలని డిఎస్‌పి సూచించారు. పోలీసులకు సమాచారం తెలియపరచ కుండా నిమజ్జనం, ఊరేగింపు ఎట్టి పరిస్థితులలో జరపరాదని పి.గన్నవరం సిఐ రుద్ధరాజు భీమరాజు సూచించారు. ఉత్సవ కమిటీ ముందుగా తీసుకున్న అనుమతుల ప్రకారం తెలియ పరచిన సమయం ఊరేగింపు మార్గం నిర్ణయించిన మార్గం లోనే వెళ్లాలన్నారు. మత్తు పానీయాలు తాగి నిమజ్జనం ఊరేగింపులలో పాల్గొనరాదని అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా పోలీసులు సాయంత్రం ఏడు గంటల వరకు నిమజ్జన కార్యక్ర మం విధుల్లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అంబాజీపేట,పి.గన్నవరం, మామిడి కుదురు, అయినవిల్లి ఎస్ఐలు కె.చిరంజీవి, బి.శివకృష్ణ, ఎ.చైతన్యకుమార్, హరికోటి శాస్త్రి, ట్రైనింగ్ ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పోతవరంలో డ్రైడే నిర్వహణ

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని పోతవరం గ్రామ సచివాలయం-2 ప్రాంతంలో శుక్రవారం డ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వల్ల వచ్చే వ్యాధులు, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా తిరిగి ఫీవర్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం.జయప్రకాష్, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు పవర్ కట్

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం మురమండ సబ్ స్టేషన్ మరమత్తులు, సాంకేతిక లోపాలను సరిచేయు నిమిత్తం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే మురమండ, ఎంఆర్.పాలెం, వీరవరం, దామిరెడ్డిపల్లి, దుళ్ల గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ ఎపిఇపిడిసిఎల్ ఇఇ జెబిప్రి.నటరాజన్ శుక్రవారం తెలిపారు. వ్యవసాయ బోర్లకు, గృహాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

7న 'మాట్లాడుతూనే ఉంటా' కవితా సంపుటి ఆవిష్కరణ

చాగల్లు : చాగల్లుకు చెందిన బహుజనవాద కవి ఎన్.రత్నాజీ రచించిన 'మాట్లాడుతూనే వుంటా" వచన కవితా సంపుటి ఆవిష్కరణ సభ 7వ తేదీన విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుందని రత్నాజీ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి ఆవిష్కర్తగా హాజరయ్యే ఈ సాహిత్య సభలో బహుజన రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నూకతోటి రవికుమార్, కథకులు వేంపల్లి షరీఫ్, డాక్టర్ జడా సుబ్బారావు, సాహితీ స్రవంతి వొరప్రసాద్, సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షులు పేరూరి మురళీకుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం సామాజిక పరివర్తన కేంద్రం ఫౌండర్ వున్నవ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతందని కవి తంగిరాల సోనీ తెలియజేసారు. ఈ సభకు రాష్ట్రంలో ఉన్న బహుజనవాదు, అంబేద్కరీయ కవులు హాజరుకావాలని కోరారు

నాగంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం : మండలంలోని నాగంపల్లిలో రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ 'మన ఊరు, మన ఎంఎల్ఎ, మన పల్లెబాట' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాలను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ప్రారంభించారు. సాధారణ వైద్యంతోపాటూ, కంటి, దంత వైద్య సేవలు అందించారు. రాజమహేంద్రవరానికి చెందిన మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమీ నేత్రాలయం, రామా డెంటల్ ఆస్పత్రి వైద్యులు వైద్య సేవలు అందించారు. బత్తుల వెంకటలక్ష్మి స్వయంగా శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరికి ఎల్‌ఒసిలు అందజేత

ప్రజాశక్తి-గోకవరం

గోకవరానికి చెందిన ఉప్పలపాటి రవికుమార్, వల్లూరి ప్రసాద్‌లకు ముందస్తు వైద్యం కోసం ఎల్‌ఒసిలను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శుక్రవారం అందనేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్ల చంటిబాబు, గాజింగం సత్తిబాబు, బదిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతారామకష్ణ, బదిరెడ్డి బాబి, గల్లా రాము, పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- కడియం

పుట్టినరోజు అంటే కేవలం వేడుకలు, ఆడంబరాలు మాత్రమే కాదని నిరూపిస్తూ, మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన యువ నర్సరీ రైతు వెన్నపు మణికంఠస్వామి(అయ్యప్ప) అభినందనీయుడని టిడిపి వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అన్నారు. అయ్యప్ప పుట్టినరోజు సందర్భంగా కడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ గోరంట్ల స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని ఆయన అన్నారు. రాజమండ్రి గాంధీ హాస్పిటల్, శ్రీ మహేశ్వరి డెంటల్ కేర్,



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రవిరామ్‌కిరణ్

సాహితి కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందంచారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు వేదాంతం రవిప్రసాద్, వెలుగుబంటి నాని, చిక్కాల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలో జరగుతున్న పలు అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. పద్మావతినగర్, హుకుంపేట ప్రాంతాలను ఆమె శుక్రవారం సందర్శించారు. తొలుత పద్మావతి నగర్ పార్కును పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పూల్ వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే నేషనల్ హైవే వైపున లైటింగ్ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న 50.6 ఎంఎల్‌డి సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. ఈ పనులను డిసెంబర్ నాటికి పూర్తి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని సమయానికి పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, డిఇ లోవరాజు, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

ప్రజాశక్తి -కొవ్వూరు

పంటకు అవసరం మేరకు మాత్రమే యూరియాను వాడాలని వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాసరావు రైతులకు సూచించారు శుక్రవారం మద్దూరు ప్రాథమిక వ్యవసాయ వర్తక సంఘంలో యూరియా నిల్వలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగానే ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎరువుల నిల్వలను పరిశీలించారు. 67.5 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. కొవ్వూరు శ్రీరామ సొసైటీలో 12.6 మెట్రిక్ టన్నులు, దొమ్మేరులో 20మెట్రిక్ టన్నులు, వేములూరులో 12.6 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. వరి చెరువు పొట్ట దశలో 25 కిలోల యూరియా 25 కిలోల పొటాష్ కలిపి వాడుకోవాలన్నారు. ఆయన వెంట ఎఒ ఎ.గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు నాయుడు వీర్రాజు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని ఆవుపాడు గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి 15 మందిని గాయపరిచింది. దీంతో భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు పిచ్చి కుక్కను తరిమి కొట్టి హతమార్చారు. గాయపడిన వారిని నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అచ్చన్నపాలెంలో ఎస్‌సి కాలనీలో కోతుల బెడద ఎక్కువగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు ముఖ్యంగా నెంబర్-2 పాఠశాల విద్యార్థిని విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇటీవల కాలనీలోని ఇద్దరు యువకులను కోతులు కరిసినట్లు గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎఎంసి ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి - కొవ్వూరు

ఎపి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి వివరించామని ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నక్క వెంకటరత్నం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చైర్మన్ కెఆర్.సూర్యనారాయణ, ఇతర నాయకులతో పాటు అమరావతిలో మంత్రిని కలిశామన్నారు. కనీస వేతనాలు పెంచేందుకు ప్రభుత్వానికి రెండు మూడు రోజుల్లో నివేదిక పంపిస్తా మని మంత్రి హామీ ఇచ్చినట్లు వెంకటరత్నం తెలిపారు. ఎఎంసిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని కోరామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 ఏళ్ల రిటైర్మెంట్ వయస్సును వర్తింపజేయాలని కోరామన్నారు.

ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

- నేడు అమెరికా అధ్యక్షుడు టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

తక్షణం కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, అమెరికా సుంకాలపై ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని ఇవి భారత వ్యవసాయ రంగాన్ని వాణిజ్య వ్యవస్థను కుదేలు చేస్తుందన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయం గొల్లగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికాతో చేసుకున్న వాణిద్య ఒప్పందాలు మన దేశ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందనానరు. ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని అన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయి. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుండి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతుందని ఇది సబబు కాదని ఎద్దేవా చేశారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయనీ వాపోయారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేస్తూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 6న నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు పిలుపు నిచ్చాయని అన్నారు. అందులో భాగంగా ఈనెల 6న శనివారం జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమా లు అన్నింటిలోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

7న బాల బాలాజీ ఆలయం మూసివేత

ప్రజాశక్తి - మామిడికుదురు

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయాన్ని ఈనెల 7న ఆదివారం తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూసి వేస్తున్నట్లు సహాయ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు సోమవారం ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి దర్శనములు యతావిధిగా జరుగుతాయన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే వైసిపి ఆందోళనలు

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రభుత్వం పారదర్శకంగా యూరియా సరఫరా, పంపిణీ చేస్తున్నా రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ ఆందోళనలు చేపడుతోంది అని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపసి ప్రభుత్వంలో కన్నా ఎక్కువ యూరియాను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు.

సమస్యలపై ఆశా వర్కర్లు పోరాడాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఆశా వర్కర్ల సమస్యలపై ఐక్యంగా పోరాడి సాధించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిని పిలుపు నిచ్చారు. గొల్లవిల్లిలో శుక్రవారం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బీర ఎస్తేరు రాణి అధ్యక్షతన ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం సిఐటియు నాయకురాలు పి.బేబీగంగారత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు.అనేక పోరాటాల ఫలితంగా ఆశా వర్కర్లకు ఆరు నెలలు మెటర్నటీ సెలవు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఉద్యోగ విర మణ వయసు 62 సంవత్సరాలు సాధించుకు న్నామని అన్నారు. రానున్న రోజుల్లో ఆశా వర్కర్లకు వేతన పెంపు, టిఎ, డిఎ తదితర డిమాండ్లపై ఐక్యంగా



గొల్లవిల్లిలో ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం

పోరాడుదామని పిలుపునిచ్చారు. మండల స్థాయిలో ఆశా వర్కర్లు నాయకత్వ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలుగా ఆదిలక్ష్మి, కార్యదర్శిగా మేకల బాలవేణి, కోశాధికారిగా విజయలక్ష్మి తో పాటు మరో నలుగురితో కమిటీని ఏర్పాటు చేశారు.

ఫ్లెక్సీలపై వివాదాస్పద రాతలను అరికట్టండి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రశాంతంగా ఉండే గ్రామాలలో వివాదాస్పద రాతలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి వివాదాలకు కారణం అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జెఎసి నాయకులు శుక్రవారం ఎంపిడిఒ భూపతిరాజు తులసి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందని ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద బోర్డు లపై తప్పనిసరిగా జిల్లా పేరు రాసేటప్పుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని రాసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు కూడా వారు ప్రింట్ చేసే వాటిపై అడ్రస్ ముద్రించేటప్పుడు తప్పనిసరిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరు ప్రింట్ చేసే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్ బాబు, జెఎసి నాయకులు కుంచే బాబులు, దేవరపల్లి రాంబాబు, గుంట్రు చిట్టిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, పరమట మురళి ఉన్నారు.



సమాజ గతిని మార్చేది గురువులే...

ప్రజాశక్తి-కడియం

ఏ సమాజంలో ఉన్నత ఆశయాలు కలిగిన గురువులుంటారో ఆ సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. కడియం వెలుగుబంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో పనిచేస్తున్న 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోరంట్ల,ట్రస్ట్ గౌరవాధ్యక్షులు, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్,ట్రస్ట్ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ వెలుగుబంటి నాని మాట్లాడారు. ఆదర్శ ఉపాధ్యాయుడు, ఆదర్శ రాజకీయ నాయకుడు, డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయుల పుట్టినరోజుగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ, మండల విద్యాధికారులు, మణికుమార్, నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు సభను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు టివి.అరుణగాయత్రి, జి.పాల శంకర్, జి.ఆనంద్, జి.శరత్‌బాబు, ఎన్.శ్రీవల్లితాయారు, ఎం.బ్యులారత్నం, పి.రమానాగేశ్వరి, కె.గంగాభవాని, గొల్లపల్లి సత్యనారాయణలను ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి,పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో కాలేజీ విద్యను అభ్యసిస్తున్న 35 మంది బాలికలకు ఏకరూప దుస్తుల నిమిత్తం రూ.40 వేలు విరాళంగా అందించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లిలో శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాలు మేరకు గ్రామ ప్రజలకు పాత రేషన్ కార్డులు స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకటరావు, వెన్నా వెంకటేష్, కంటి పోయిన చంటిబాబు, కె.ప్రసాద్, బి.వీరయ్య, నూకలమంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాటక అకాడమీ డైరెక్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యవర్గ సభ్యులు పెంకే సాంబశివరావు సతీమణి పెంకే అన్నపూర్ణ ఎపి రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రావు మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన పెంకే అన్నపూర్ణను నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమించిన సిఎం చంద్రబాబుకు, మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు సాంబ శివరావు, అన్నపూర్ణ మాట్లాడుతూ నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్ర మంలో పరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు,బుర్రకథ కళాకారులు గరగ బాబూరావు, వాడ్రేవు వెంకటరావు, పరిషత్ ఆహ్వాన కమిటీ సభ్యులు బిఎల్.నారాయణ, తీపర్తి సతీష్,ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్‌తో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి- రాజోలు

డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎగ్ కార్ట్‌ల వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని రాజోలు ఎంపిపి కడలి శ్రీ దుర్గా అన్నారు. శుక్రవారం రాజోలు మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.50 వేలు విలువైన ఎగ్‌కార్ట్‌లను సాయి సునంద డ్వాక్రా గ్రూపునకు చెందిన కాళ్ళ రామలక్ష్మికి ఆమె అందజేశారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్,చాగంటి స్వామి,ఎపిఎం వర్మ,కాట్న రాజు,కోళ్ల బాబి,దారపురెడ్డి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

విద్యుత్‌లైన్‌ల్లో మరమ్మతుల కారణంగా నేడు శనివారం సరఫరాకు అంతరాయం కలుగు తుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పల్లంకూరు నూతన సబ్ స్టేషన్ పనుల నిమిత్తం ఈ అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్తు లైన్లో మరమతులు వంటి పనులు చేపట్టడతామన్నారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక నక్కావారిపేటలో పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలజీవన్‌మిషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయి పనులను త్వరిత గతిన పూర్తి చేసి సకాలంలో ప్రజలకు నీరు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే వాటర్ ట్యాంకు వద్ద జరుగుతున్న రిపేరు పనులను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం నందు నిర్మిస్తున్న కిచెన్ గార్డెన్ పనులను పరిశీలించారు. పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టిక ఆహారం అంది స్తుందని ప్రతి ఒక్కరు వినియోగించుకుని పిల్లల సంఖ్యను పెంచాలని సూచించారు.

పాఠశాలలో వంట షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - అయినవిల్లి

నేదునూరు పెదపేట ఎంపిపి మోడల్ పాఠశాల నందు స్థానిక ఎంపిటిసి సభ్యులు ఇందుగుల వెంకట్రామయ్య ఆర్థిక సహకారంతో వంట షెడ్డును నిర్మించారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంఇఒ మేల్లం శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన వంట షెడ్డును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఇందుగుల వెంకట్రామయ్యను, బదిలీపై వెళ్లిన పాఠశాల హెచ్‌ఎం ఎం.రామకృష్ణను ఘనంగా సన్మానించారు. ఎంపిటిసి సభ్యులు కె. సుబ్బరాజు, మాజీ ఎంపిపి జి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.